# పోస్ట్ మోడర్నిజం వామపక్ష చైతన్యం

**– కె. బాలగోపాల్**

పోస్ట్ మోడర్నిజం ( ఆధునికానంతర వాదం) అనే పేరులోనే అనవసరమైన ఆడంబరం ఉంది. ఆ ఆలోచనా రీతి ఆధునికానికి 'అనంతరం' అయితే దానికి అనంతరం ఏమిటి? దానికి అనంతరమేదీ ఉండదా? అదే చరిత్రలో ఆఖరి తాత్విక వైఖరా?

పేరులోనే కాదు, పరిభాషలోనూ పోస్ట్-మోడర్నిజంలో చాలా ఆడంబరం ఉంటుంది. దానివల్ల ఆధునికానంతర వాదుల రచనలు చదవడం, అర్థం చేసుకోవడం కష్టం.

పదజాలంలో ఉన్న అనవసరమైన ఆర్భాటం వల్ల పోస్ట్-మోడర్నిజం పట్ల సులభంగా వ్యతిరేకత ఏర్పడే ప్రమాదం ఉంది. ఆ కారణంగా ఆధునికానంతర వాద ఆలోచనా రీతిని వ్యతిరేకించే వాళ్లు చాలామంది ఉన్నారు. అది కొంత వరకు సహజమే కావచ్చు. (పైగా ఆధునికానంతర వాదుల స్వయం కృతం కూడ) కానీ ఆ రకమైన వ్యతిరేకత నష్టకరం.

ఎందుకంటే వారి ఆలోచనలలో విలువైనవి, ఉపయోగకరమైనవి కొన్ని ఉన్నాయి. ప్రధానంగా, 'ఆధునికత' అని దేనినయితే వారు అంటారో ఆ ఆలోచనారీతిలోని స్వాతిశయంపైన, తాత్విక అహంభావంపైన వారు పెట్టే విమర్శ చాలా విలువైనది. ఆధునికులమని మనల్ని మనం భావించుకునే వాళ్లకు ఈ విమర్శ నేర్పించగల తాత్విక వినమ్రత చాలా మేలు చేస్తుంది. ( ఆధునికానంతర వాదులలో ఆ వినయం ఏకోశానా కనిపించ దనేది వేరే సంగతి).

'శాస్త్రీయత' ఆధునికతకు సంబంధించిన అత్యంత కీలకమైన భావన. అది బూర్జువా దృక్పథానికి ఎంత ప్రియమైన భావనో, కమ్యూనిస్టులకు కూడ అంత ప్రియమైనది. ఈ రెండు రకాల శాస్త్రీయతలో ఒక దానిని ఎంచుకోవాలన్న ఒత్తిడి ఈ శతాబ్ద రాజకీయాలను శాసించింది. రెండింటినీ విమర్శించే వారు లేక పోలేదు గానీ వారు సనాతన వాదులుగా గుర్తించబడ్డారు. కాబట్టి శాస్త్రీయతపైన వారు పెట్టే విమర్శకు పెద్దగా విలువ లేకుండా పోయింది. కాని ఈ రెండు రాజకీయ ధోరణులకు సామాన్య తాత్విక భూమిక ఉందని గుర్తించి, దానికి 'ఆధునికత' అని పేరుపెట్టి దానిని తీవ్ర విమర్శకు గురి చేసిన ఆధునికానంతర వాదాన్ని ఆ అర్థంలో సనాతన దృక్పథం అని కొట్టి పారేయడం సాధ్యం కాక పోవడం వల్ల, ఆ విమర్శకు జవాబు చెప్పడం ఆధునికులకు తప్పని సరి అయింది.

ఆ విమర్శలో చాలా వాస్తవం ఉందని ఆధునికవాదులు గుర్తించడం అవసరం. ఆ విమర్శను మించి ఆధునికోనంతర వాదంలో వేరే ఏమీ లేదని ఆధునికానంతర వాదులు గుర్తించడమూ అవసరమే. ఎందుకంటే పోస్ట్ మోడర్నిజాన్నే ఒక ప్రాపంచిక దృక్పథంగా భావించే పోకడ ఒకటి బయలు దేరింది.

---

**కె. బాలగోపాల్**, హైదరాబాదులో పౌరహక్కుల ఉద్యమనాయకుడు
ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో వున్నారు.

ప్రాపంచిక దృక్పథానికి అవసరమైన పాజిటివ్ లక్షణాలు అందులో ఉండి ఉంటే అందుకు అభ్యంతరం చెప్పనవసరం లేదు. కాని జ్ఞాన సిద్ధాంత విమర్శకు ఉపయోగపడే తాత్విక పరికరాలనే ఒక ప్రాపంచిక దృక్పథంగా భావించడం సబబుకాదు.

విశ్వాసాలలో గాఢత, తీవ్రత ఎప్పుడూ ఉండేవే. మత విశ్వాసాలు బలంగా కలవాళ్లు తమ దగ్గరే సత్యం ఉందని, ఇతరులు చీకటిలో ఉన్నారని నమ్ముతారు. ఇది చాలా క్రూరమైన అసహనానికి దారి తీయగలదని మనకందరికీ తెలుసు. కానీ 'శాస్త్రీయ దృక్పథాల' లోనూ అంతే అసహనం ఉన్నప్పటికీ అది 'శాస్త్రీయం' కాబట్టి దానిని అసహనంగా గుర్తించడం కష్టం.

ఈ అసహనం నిజానికి మత అసహనం కంటే ఎక్కువేమో. ఎందుకంటే ఇతర ఆలోచనారీతులు ఎందుకు తప్పో వివరించగల విశ్లేషణా పరికరాలు తన దగ్గరున్నాయని శాస్త్రీయత నమ్ముతుంది. శాస్త్రీయత తనను తాను ఒకానొక దృక్పథంగా భావించదు. అన్ని దృక్పథాలలోని సత్యాసత్యాలనూ తూకం వేయగల మహాదృక్పథంగా భావిస్తుంది. అదికూడ ఒక దృక్పథమేనని చెప్పడం ఆధునికానంతరవాదం చేసే మేలు. మరయితే సత్యాసత్యాల తూకం అసలే సాధ్యం కాదా అనే ప్రశ్నకు జవాబు చెప్పగల తాత్విక పరికరాలు లేకపోవడం ఆధునికానంతర వాద బలహీనత.

'నీది తప్పు, నాది ఒప్పు' అని ప్రతి విశ్వాసమూ అంటుంది. కానీ 'నీది ఎందుకు తప్పో వివరించగల తప్పొప్పుల ప్రమాణాన్ని నేను' అని సైన్స్ మాత్రమే అంటుంది. హిందువులు ముస్లింలను మూర్ఖులు అంటారు. ముస్లింలు హిందువులను మూర్ఖులు అంటారు. కానీ వీరి మూర్ఖత్వాన్ని వారు వివరించ బూనుకోరు. వారి మూర్ఖత్వాన్ని వీరు వివరించ బూనుకోరు. (శాపగ్రస్తులనో, సైతాన్ ప్రభావంలో ఉన్నారనో అనుకోవడం తప్ప). కానీ సైన్స్ వీరిద్దరితోనూ విభేదించడం మాత్రమే కాదు. వీరిద్దరి మూర్ఖత్వాన్ని తాను వివరించగలనని నమ్ముతుంది. అవి రెండూ విశ్వాసాలు కాగా తాను విశ్వాసాలకు అతీతమైన పరమసత్యం అని సైన్స్ అంటుంది.

శాస్త్రీయత అనేది కూడా ఒక దృక్కోణమేనని అన్ని దృక్కోణాలలాగ అదికూడా పాక్షిక దృష్టేననీ ఆధునికానంతరవాదం పెట్టే విమర్శ ఆధునిక భావాలను బలంగా తాకుతుంది. రాజకీయంగా చెప్ప దలచు కున్నప్పుడు అన్ని దృక్కోణాలలాగ శాస్త్రీయత కూడా కొన్ని ప్రయోజనాలకు ప్రతినిధి అని ఆధునికానంతర వాదులు అంటారు. సైన్స్ అనేది ఎప్పటి కప్పుడు అపరిపూర్ణమేననీ ఇంకా తెలుసుకోవలసినవి ఉంటాయని నమ్మడానికీ ఈ విమర్శకూ చాలా తేడా ఉంది. మొదటిది ఆధునిక వాదులు ఒప్పుకోలేని విషయం కాదు. అది సైన్స్‌కు అప్పటి దశలో ఉన్న జ్ఞానానికి సంబంధించిన విషయం. రెండవది శాస్త్రీయత స్వభావానికి (దాని తాత్కాలిక పరిమితులకు కాదు) సంబంధించిన విషయం.

ఆధునిక వాదులలో అంతర్గతంగా ఈచర్చ ఒక కోణం నుండి జరగలేదని కాదు. బూర్జువా ఆధునికతకూ సోషలిస్టు ఆధునికతకూ మధ్య పెద్ద సంవాదమే నడిచింది. బూర్జువా దృక్పథం

'శాస్త్రీయత' అని పిలుచుకునేది యాంత్రికమనీ పాక్షికమనీ - అంటే నిజమైన శాస్త్రీయత కాదనీ వామపక్షవాదులు విమర్శించారు. అది పెట్టుబడి దారుల వర్గ ప్రయోజనాలనూ, పెట్టుబడిదారీ వ్యవస్థనూ కాపాడే 'భావజాలం' అన్నారు. వామపక్షసిద్ధాంతాలు శాస్త్రీయతను వక్రీకరించి తమ రాజకీయ ప్రయోజనాలకు అణుగుణంగా లోబరచుకున్నాయని బూర్జువా విమర్శకులు అన్నారు. అంటే అది నిజమైన శాస్త్రీయత కాదన్నారు. శాస్త్రీయ సోషలిజం కమ్యూనిస్టు పార్టీల నియంతృత్వానికి ఆలంబన ఇచ్చే 'భావజాలం' అన్నారు.

ఆధునికానంతరవాదం పెట్టేచర్చ ఇదికాదు. అది శాస్త్రీయత అనే భావననే తూర్పారబడుతుంది. అది పాక్షిక ప్రయోజనాల ప్రతినిధి అనీ, అది ప్రకటించుకునే సార్వజనీనత అబద్ధమనీ అంటుంది.

నదుల మీద భారీ పెట్టుబడితో పెద్ద ప్రాజెక్టులు కట్టి పెద్ద మొత్తంలో నీరు నిలువ ఉంచి, ఒకేసారి ఎక్కువ సాగుభూమికి నీరు ఇవ్వడం శాస్త్రీయమైన ఆలోచన. దానిని కాదనడం అశాస్త్రీయత, వెనుక బాటుతనం, మూర్ఖత్వం. దాని వలన ముంపుకు గురయి, జీవనం కోల్పోయే వారి గురించి అయ్యోపాపం అనకుండా ఉండము. అంతో యింతో పునరావాసం కల్పించకుండా ఉండము. అంత మాత్రం చేత వారికి ఇబ్బంది కలుగుతుందని చెప్పి శాస్త్రీయ ప్రగతి మార్గాన్ని వదిలి పెట్ట గలమా?

అలోపతీ వైద్యమొక్కటే శాస్త్రీయ సత్యం మీద ఆధారపడింది. అందువల్ల ప్రభుత్వం వైద్యం మీద పెట్టే ఖర్చంతా అలోపతీ మీదనే పెట్టాలి. ఇతరవైద్య పద్ధతులు అశాస్త్రీయమైనవి, అహేతుకమైనవి. వాటిని విశ్వసించడం మూర్ఖత్వం. అలాంటపుడు ఆ మూర్ఖత్వం మీద ప్రభుత్వం ఖర్చు పెట్టడం అశాస్త్రీయ మవుతుంది కదా? అలోపతీ వైద్యం ఖరీదెక్కువ కావడం వల్ల అది పేదలకు అందుబాట్లో లేక పోవచ్చు. ఇతర వైద్య విధానాలు అశాస్త్రీయం కావడం వల్ల ప్రోత్సాహం కరువయి అవి కూడ అందుబాట్లో లేక పో వచ్చు. ఇది దురదృష్టమే కావచ్చునుగానీ అంతమాత్రం చేత ప్రభుత్వం అశాస్త్రీయమైన వైద్య విధానాలను ప్రోత్సహించాలనడం సబబు కాదు కదా? ప్రజలు ఏ వైద్యమూ లేక చావడం విచారకరమే, కాని శాస్త్రీయ ప్రమాణాలను కాదని ప్రభుత్వం మూఢత్వాన్ని ప్రోత్సహించ వచ్చునా?

చాలా అమాయకంగా చాలామంది ఆమోదించే ఈ శాస్త్రీయ దృక్పథం చాలా క్రూరమైనదని వేరే చెప్పనవసరం లేదు. మతం మార్చుకుంటావా చంపమంటావా, అంటూ కత్తి పట్టుకొని తలలు కోసే మతవాదుల క్రూరత్వానికి ఇదేమీ తీసిపోదు.

అయితే ఈ ఉదాహరణలు వామపక్షవాదులను పెద్దగా ఇబ్బంది పెట్టవు. వీటిలోని శాస్త్రీయతకు 'బూర్జువా' అన్న విశేషణం తగిలించి తప్పించుకోగలరు. మీరు పరిపాలించిన చోట మీ ప్రభుత్వాలు కూడా ఇటువంటి వైఖరే అనుసరించిన ఉదంతాలు లేవా అని అడిగితే, కొన్ని పొరబాట్లు జరిగాయనో, గతితార్కికంగా వ్యవహరించడంలో విఫలమయ్యారనో సర్ది చెప్పగలరు. ఈ విమర్శే

ఆధునికానంతరవాదం చెప్పే విషయమయితే అందులో వామపక్షవాదులను మరీ ఎక్కువగా ఇబ్బంది పెట్టే విషయ మేమీ లేదు.

కాని సమాజ చారిత్రక క్రమంలో ఉన్న హేతువు (రీజన్) గురించి మార్క్సిజానికి ఉన్న విశ్వాసాన్నే ఆధునికానంతర వాదం ప్రశ్నిస్తుంది. శాస్త్రీయ సోషలిజానికి భూమిక అయిన ఈ చారిత్రక హేతువు కూడ, అలోపతీ వైద్యంలోని శాస్త్రీయత లాగ, చాలా అమాయకంగానే చాలా క్రూరంగా ఉండ గలదని విమర్శిస్తుంది. ఈ హేతువు ఒక దృక్కోణం నుండి చేసిన రూపకల్పనే తప్ప అందులో ప్రామాణిక సత్యమేమీ లేదని అంటుంది.

సోవియట్ రష్యాలో శాస్త్రీయ చారిత్రక క్రమానికి వ్యతిరేకంగా, వ్యవసాయ సమిష్టీకరణను తిరస్కరించి, ఇంకా స్వంత ఆస్తిమీద మమకారం పోగొట్టుకోకుండా ఉన్న రైతులతో, స్టాలిన్ అతిక్రూరంగా వ్యవహరించాడు. బలత్కారంగా జరిగిన సమిష్టీకరణలో రైతులు లక్షలాదిగా చనిపోయారు. ఇది కేవలం ప్రజల అభీష్టాన్ని ఖాతరు చేయని నియంతృత్వ రాజకీయ ధోరణి మాత్రమే కాదు. సత్యం తమను నడిపిస్తుందన్న శాస్త్రీయ అహంకారం కూడా ఉంది. ప్రాజెక్టుకింద మునిగిపోయే జనావాసాల జీవనాన్ని గురించి అడిగినప్పుడు 'ప్రగతి పథంలో శాస్త్రీయంగా ముందుకు పోవాలంటే ఇటువంటివి అనివార్యం మరి, ఏం చేస్తాం' అని ఇతరత్రా సున్నిత మనస్కులయిన ఆధునిక వాదులు సహితం అనగలిగినట్టు, స్టాలిన్ చేసిన బలవంతపు వ్యవసాయ సమిష్టీకరణ గురించి కూడ ఇతరత్రా సున్నిత మనస్కులయిన కమ్యూనిస్టులు 'విప్లవ క్రమంలో తిరోగామి శక్తులపైన పోరాటం అనివార్యం మరి, ఏం చేస్తాం' అంటారు. మామూలుగా వీటిలో మొదటిదానిని 'బూర్జువా అభివృద్ధి'కి స్వాభావికమైన అణచి వేత వైఖరిగాను, రెండవ దానిని విప్లవం కోసం పడే ఆరాటంలో జరిగే తొందరపాటు ధోరణిగాను అర్థం చేసుకోవడం జరుగుతుంది. కానీ ఇక్కడున్నది కేవలం అభివృద్ధి, విప్లవం అనే ఆకాంక్షలు మాత్రమే కాదు. ఈ రెండు దృక్పథాలలోనూ అవి కేవలం ఆకాంక్షలు కావు. అవిశాస్త్రీయ భావనలు. సార్వత్రిక సత్యానికి వాహకమయిన చారిత్రక హేతువు వాటిని నడిపిస్తుంది. శాస్త్రీయ ప్రగతి క్రమాన్ని చారిత్రక హేతువును ఎవరికో నష్టం కలుగు తుందని వదులు కోగలమా అనే సామాన్య వైఖరి ఈ రెండు ధోరణులలోనూ ఉంది. రోగం నయం కావ డానికి ఫలాన బాధా కరమైన ఆపరేషన్ తప్పనిసరి అని అమెరికాలో ఎం. ఎస్. చేసివచ్చిన వైద్య శాస్త్రజ్ఞుడు చెప్పిందే తడవుగా, దానివల్ల కలిగే బాధను 'భరించాలి మరి' అని ఇతరత్రా ఇతరుల బాధను చూసి చలించి పోయేవారు సహితం తేలికగా అన గలుగుతారు. ఆకోవకు చెందినవే ఈ వ్యాఖ్యలు కూడా. నిజానికి 'చారిత్రక క్రమంలో' కలిగే కష్టాలను ఇరు దృక్పథాలూ తరచుగా ఆపరేషన్‌తో పోలుస్తాయి. ఆపరేషన్‌లోని 'శాస్త్రీయ అనివార్యత' రెండు దృక్పథాల ప్రగతి పథంలోనూ ఉంది.

ఇక్కడ ఆధునికానంతరవాదం పెడుతున్న విమర్శ కేవలం నైతిక మానవతావాద విమర్శ కాదు. శాస్త్రీయమే అనుకొన్నా కొంచెం జాలి చూపించ వచ్చును కదా? కొంచెం ఉపశమనం కలిగించ

వచ్చునుకదా? అని మాత్రమే అడగడం లేదు. 'శాస్త్రీయం' 'హేతుబద్ధం' అనేవి అన్ని దృక్కోణాలనూ చీల్చి చెండాడగల ప్రామాణిక సత్యాలు కావనీ అవి ప్రామాణికమైన మహా దృక్పథాలుగా చలామణి అవుతున్న ప్రత్యామ్నాయ దృక్పథాలు మాత్రమేననీ ఆధునికానంతర వాదం అంటుంది. అన్ని దృక్పథాల లాగ ఇవి కూడా కొందరి - లేక కొన్ని - ప్రయోజనాలను కాపాడి ఇతర ప్రయోజనాలను దెబ్బతీస్తాయనీ, వీటిని సత్యానికి ప్రమాణంగా భావించడం అహంభావానికి దారితీస్తుంది తప్ప అందులో నిజమేమీ లేదని అంటుంది.

ఇది కేవలం హితవుకాదు. 'అతి' ని కొంచెం తగ్గించు కొమ్మని చెప్పే విమర్శ కాదు. ఇది జ్ఞాన సిద్ధాంత విమర్శ. అంటే మనిషికి ప్రపంచాన్ని గురించి ఉండే జ్ఞానం స్వభావం ఏమిటి అని చెప్పే తాత్విక సిద్ధాంత రంగానికి చెందిన విమర్శ. ఆధునికమైన అన్ని దృక్పథాలకూ - బూర్జువా దృక్పథాలకూ మార్క్సిజానికీ కూడా - వర్తిస్తుంది.

దీనికి అనుబంధంగా ఆధునికానంతర వాదంలో కొన్ని విలువైన ఆలోచనలున్నాయి. వెలుగు మనకేమి చూపిస్తుందనే విషయం మీద మాత్రమే మనం ప్రధానంగా దృష్టి పెడతాం. ఇది మానవ సహజమైన వైఖరే గాని ఆధునిక దృక్పథాలు దానిని మరింతగా ప్రోత్సహిస్తాయి. ఇంకా ఎక్కువ వెలుతురు ఇచ్చే దీపాలనూ ఇంకా ఎక్కువ దూరం వెలుగు ప్రసరింపజేసే దీపాలనూ ఆవిష్కరించుకోవడం శాస్త్రీయత మనకు నేర్పింది. కానీ ప్రతిదీపమూ చూపించే వెలుగులే కాక దాచిపెట్టే చీకట్లు కూడా ఉంటాయనీ; మొదటిది ఎంతగా ఆ దీపం లక్షణమో, రెండవది కూడా అంతే ననీ ఆధునికానంతరవాదం అంటుంది.

వెలుతురు - చీకటి లాంటిదే శబ్దం - నిశ్శబ్దం కూడా. 'నిశ్శబ్దం' అనేది ఆధునికానంతరవాద పరిభాషలో ఒక ముఖ్యమైన పదం. శబ్దం మీద దృష్టిపెట్టి, దాని అర్థాన్ని సునిశితంగా విశ్లేషించుకోవడం, తప్పొప్పులను హేతుబద్ధంగా వ్యాఖ్యానించుకోవడం ఆధునికవాద శాస్త్రీయత మనకు నేర్పుతుంది. కాని ఆ శబ్దం దాచిపెట్టే నిశ్శబ్దాన్ని వెలికి తీసి చూడమని ఆధునికానంతర వాదం అంటుంది. చరిత్రనూ, సమాజాన్నీ, మానవ అస్తిత్వాన్నీ ఒక సిద్ధాంతం వెలుగులో వ్యాఖ్యానించు కునేటప్పుడు ఏమేమి కనిపిస్తుందో, అది ఎంత వరకు వాస్తవికమో చూడడం శాస్త్రీయత మనకు నేర్పుతుంది. కాని ఒక్కొక్క సిద్ధాంత చట్రానికి ఉండే నైజం వల్ల కొన్ని విషయాలు ఆ సిద్ధాంత విశ్లేషణలో అసలే కనిపించ కుండా పోతాయని గుర్తించి వాటిని వెలికి తీయడం అవసరం అని ఆధునికానంతరవాదం మనకు గుర్తు చేస్తుంది.

దృక్కోణం, వ్యాఖ్య, సిద్ధాంతం అనే వాటిని శాస్త్రీయత - అశాస్త్రీయత అనే ప్రమాణాలతో కొలిచి నప్పుడు మనం వాటిని చూసే పద్ధతికీ, వాటికి అందని చీకట్లనూ, నిశ్శబ్దాన్నీ వెతికి బయటపెట్టాలనుకున్నప్పుడు మనం వాటిని చూసే పద్ధతికీ చాలా తేడా ఉంటుంది. ఈ తేడాను మన దృష్టికి తేవడం ఆధునికానంతర వాదం చేసే గొప్ప మేలు.

కులం, జెండర్ అనే రెండు సమస్యలు వామపక్ష సిద్ధాంత వేత్తలకు కనిపించకుండా ఉండడానికి గల సామాజిక కారణం ( ఆ సిద్ధాంత వేత్తలంతా అగ్రకులాల పురుషులు కావడం) ఎంత ముఖ్యమో, శాస్త్రీయత తన ప్రత్యేకగుణమని నమ్మే ఆ సిద్ధాంతం ఆ నమ్మకం కారణంగానే తన తర్క చక్షువులకు కనిపించని విషయాలను మానవ చక్షువులతో నిత్యం చూస్తూ ఉండి కూడ గుర్తించ లేక పోవడం అంతే ముఖ్యం.

అయినప్పటికీ ఆధునికానంతరవాదం ఆధునికతను అభావం చేయగల నూతన ప్రాపంచిక దృక్పథమని నేను అనుకోవడం లేదు. అది ఆధునికతలోని లోపాలను సవరించడానికీ, దాని అహంభావాన్నీ, స్వాతిశయాన్నీ తగ్గించి, జ్ఞాన సిద్ధాంత సంబంధమైన వినయాన్ని నేర్పించడానికి మాత్రమే పనికొస్తుంది. అది చిన్న విషయం కాదు. కాని అదే సర్వం కాదు.

దీనికి గల తాత్విక కారణాన్ని సూచించి ముగిస్తాను. ఏ సత్యమూ - సైన్స్‌తో సహా - పరమ సత్యం కాదనీ అన్నీ ఒక దృక్కోణానికీ ఒక పరిస్థితికీ సాపేక్షంగా మాత్రమే సత్యాలనీ గుర్తించిన తరువాత 'ఎంత సత్యం?' అనే తులనాత్మక పరిశీలన చేపట్టడం అవసరం. అంతా సాపేక్షం అని ప్రకటించిన తరువాత 'ఏది ఎప్పుడు ఎంత సాపేక్షం?' అన్న ప్రశ్న వేసుకోవలసి ఉంటుంది. దానికి కావలసిన తార్కిక పరికరాలు రూపొందించుకోవలసి ఉంటుంది. లేకపోతే సాపేక్షమే సర్వం అయిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది ఒక కొత్త పిడివాదం అవుతుంది.

ఈ పరికరాలు ఆధునికానంతర వాదం దగ్గర లేవు. వాటి కోసం తిరిగి ఆధునిక వాద నమూనాలోని జ్ఞాన సిద్ధాంతాలనే ఆశ్రయించవలసి ఉంటుంది. 'ఏది ఎంత సత్యం?' అన్న ప్రశ్న వేస్తున్నా మంటేనే భిన్న సత్యాలను తూకం వేయగల ప్రమాణం ఉందని అర్థం. ఇది 'ఆధునిక వాదం' భావించినట్లు - పూర్తి సత్యాన్ని తెలుసు కోగల ప్రామాణిక దృక్కోణం కానక్కరలేదు. ఏ ఒక్క దృష్టి కోణానికీ సత్య మంతా దొరుకు తుందని నమ్మక పోయినా, సత్యం అనేది దృష్టి కోణాలకు ఆవల ఉందని నమ్మడం అవసరం. ఒక్కొక్క దృష్టి కోణం దానిని ఒక్కొక్క సందర్భంలో ఎక్కువ తక్కువలుగా గ్రహించ గలుగు తుందని అప్పుడు గుర్తించ గలుగుతాం. ఆ ఎక్కువ తక్కువలను కొలవగల పరికరాలను రూపొందించు కోగలుగుతాం. ఇదేదీ ఆధునికానంతర వాద చట్రంలో సాధ్యం కాదు. ఆధునిక వాద చట్రంలోనే అవుతుంది. అయితే అది ఆధునికానంతర వాదం పెట్టే విమర్శ నుండి నేర్చుకున్న అధునికవాదమైతేనే ఇప్పటి దాకా శాస్త్రీయత, హేతువు అనే భావనలను అంటిపెట్టుకొని ఉన్న అసహనం, క్రూరత్వాల నుండి బయటపడగలుగుతుంది.

---

"Modernity can be taken as a summary term referring to that cluster of social, economic and political systems brought into being in the west from somewhere around the eighteenth century onwards". ***(An Introudction to guide to Poststructualism and Postmodernism - Madan Sarup,*** Page - 130)